క్లుప్తంగా

చెట్లకు నిప్పుపెట్టిన దుండగులు



అయిజ: మండలంలోని ఉప్పల క్యాంప్, మున్సిపాలిటీ పరిధిలోని పర్దిపురం మధ్యన ఉన్న కర్నూలు– రాయచూర్ రోడ్డు పక్కన ఉన్న చెట్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టి కాల్చేశారు. ప్రభుత్వం చెట్లను పెంచాలని ప్రోత్సహిస్తున్నా, కొందరు వ్యక్తులు ప్రతి సంవత్సరం కాల్చివేస్తున్నారని పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు. అధికారులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీచుపల్లిలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



ఎర్రవల్లి: మండల పరిధిలోని బీచుపల్లి అభయాంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు సందర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులతో కలిసి స్వామిని దర్శించికొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభకు వెళ్తున్న వాహనాలకు ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శాంతినగర్‌లో అవగాహన సదస్సు

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ భవాని ఫంక్షన్‌హాల్‌లో భూ భారతి చట్టంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ భద్రప్ప ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని తహసీల్దార్ కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఇటిక్యాల: మండల పరిధిలోని సాతర్ల గ్రామానికి చెందిన బీజేపీ మండలాధ్యక్షుడు షేక్ అబ్దుల్లా తండ్రి పెద్ద రజాక్‌మియా శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు ఆదివారం సాతర్ల గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి మృతులకు నివాళి

ఆత్మకూర్: పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలు మితిమీరిపోతున్నాయని, దేశంలో మత సామరస్యాన్ని దెబ్బతీసేందుకు పిరికిపందల చర్యలకు పాల్పడుతున్నారని స్వర్ణసహకార సంఘం రాష్ట్రనాయకుడు బంగారు భాస్కర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని నీలకంఠేశ్వర ఆలయం వద్ద మృతులకు సంఘీభావంగా మౌనం పాటించి, నివాళులర్పించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరుగకుండా కేంద్రం కఠినమైన చర్యలు తీసుకోవాలని, దెబ్బకు దెబ్బ తీసి పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బంగారు ప్రకాష్, నరేష్, డీకే ప్రకాష్, బాలరాజు, శ్రీధర్, భాస్కర్, నరహరి, శివ, తరుణ్, సతీష్, మురళి, మహేష్, రఘు, మణి తదితరులు ఉన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సాయిల్ గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓఎస్ భవనంలో పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయిల్ గౌడ్, గౌరవాధ్యక్షుడిగా ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా బాలకిషన్, నారాయణరెడ్డి, మోహబూబ్ అలీ, బురానుద్దీన్, సత్యవతి, ప్రధాన కార్యదర్శిగా అంజయ్య ఆచారి, కోశాధికారిగా విశ్వనాథం, ప్రచార కార్యదర్శిగా బాలరాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సాయిల్ గౌడ్ మాట్లాడుతూ.. పెన్షనర్లకు ఏ సమస్య తలెత్తినా సంఘం తరఫున అండగా ఉంటామన్నారు. సంఘ బలోపేతానికి అందరూ సహకరించాలని కోరారు.

నామమాత్రంగా వ్యవసాయ క్షేత్రాలు

- 110 ఎకరాల్లో ఏర్పాటు చేసిన చిట్టిఫారాలు
- దశాబ్దాల క్రితం ఫారాల్లో విత్తన వైభవం
- ప్రస్తుతం తూతూ మంత్రంగా సాగు
- నిరుపయోగంగా గోదాంలు
- శిథిలావస్థకు చేరిన భవనాలు



జూలెకల్‌లో ఏర్పాటు చేసిన వ్యవసాయ క్షేత్రం

శాంతినగర్: దశాబ్దాల క్రితమే ఎంతో మంది నిరుపేదలకు ఉపాధి కల్పించిన ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ అండ్ డెమాన్‌స్ట్రేషన్ (పీ.డీఅండ్‌డీ) చిట్టిఫారాలు. ప్రస్తుతం ఏ పంటా, కూలీల సందడి లేక ఎడారిని తలపిస్తున్నాయి. గతంలో వందల మంది కూలీలతో విరాజిల్లిన ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాలు ప్రస్తుతం ఎవరికీ ఉపయోగపడక శిథిలావస్థకు చేరుకున్న భవనాలతో బూత్ బంగ్లాలను తలపిస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

లక్షలు వెచ్చించి

అలంపూర్ నియోజకవర్గంలోని జూలెకల్ స్టేజి సమీపంలో 1980 సంవత్సరంలో లక్షలు వెచ్చించి 50 ఎకరాల విస్తీర్ణంలో, మానవపాడు మండలం కొర్విపాడు సమీపంలో 60 ఎకరాల్లో విశాలమైన భవనాలు, గోదాములతో వ్యవసాయ క్షేత్రాలు ఏర్పాటుచేశారు. సుమారు పది ఎకరాల్లో భవనాలు మినహా మొత్తం ఉన్న వ్యవసాయ భూమిలో మేలు రకాల వంగడాలు, విత్తనాలకు ఉపయోగపడే వేరుశనగ బుడ్డలు, వివిధ రకాల మొక్కల నర్సరీలతో కళకళలాడేవి. అంతేగాక చుట్టు ప్రక్కల ఉన్న కొంకల, జూలెకల్, యాపదిన్నె, ముండ్లదిన్నె, తనగల, కొర్విపాడు, కలుకుంట్ల గ్రామాల్లో నివసించే నిరుపేద కూలీలకు అన్నం పెట్టే అన్నపూర్ణలుగా, రైతుల పాలిట మేలు రకాల విత్తనాలు ఉత్పత్తిచేసే వ్యవసాయ క్షేత్రాలు పేరుగాంచాయి.

విత్తనాలు, మందుల కొనుగోళ్లు

నియోజకవర్గంలోని ఆయా గ్రామాల రైతులు గతంలో చిట్టిఫారాల్లోనే మేలు రకం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసేవారు. వ్యవసాయంలో మెలకువలు నేర్చుకుని అధిక దిగుబడుల్లో అగ్రగామిగా నిలిచి ఇతర ప్రాంతాల నియోజకవర్గ రైతులు ఆదర్శంగా నిలిచేవారు. ప్రస్తుతం ఆ క్షేత్రాలు వ్యవసాయశాఖ ద్వారా నిరాదరణకు గురై శిథిలావస్థకు చేరుకున్నాయి.

నిరుపయోగంగా బోరుబావులు



పచ్చదనం లేక ఎడారిని తలపిస్తున్న వ్యవసాయ భూమి

వర్షాకాలంలో వర్షాధారంగా, యాసంగిలో బోరు బావుల్లోని నీటితో పూర్తిస్థాయిలో పచ్చని పైర్లతో వ్యవసాయ క్షేత్రాలు కళకళలాడేవి. ప్రస్తుతం బోరు బావులు నిరుపయోగంగా మారడంతో కేవలం వర్షాధారంతో ఏడాదికి ఒక పంట నామ్‌కే వాస్తేగా పండిస్తూ వ్యవసాయ క్షేత్రాలు ఉనికిని కోల్పోతున్నాయి.

కంది పంటకే పరిమితం

గతంలో చిట్టి ఫారాల్లో వివిధ రకాల మేలురకం వంగడాలు పండించి అక్కడే రైతులకు విక్రయించేవారు. ప్రస్తుతం కేవలం కందిపంట సాగుచేస్తూ మమ అనిపిస్తున్నారు. రైతులు పంట మార్పిడి చేస్తేనే దిగుబడులు బాగా వస్తాయని చెబుతూ వ్యవసాయ అధికారులు మాత్రం వేసిన పంటనే ప్రతి ఏడాది సాగుచేస్తూ రైతుల దృష్టిలో అభాసుపాలవుతున్నారు. వ్యవసాయ క్షేత్రంలో మేలురకాల వంగడాలు ఉత్పత్తి చేసి లేదా ఏరువాక కేంద్రాలు, కృషివిజ్ఞాన కేంద్రాలు, మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి రైతులకు ఉపయోగం పడేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాలమూరుకు వెళ్లాల్సి వస్తోంది



మేలు రకం వంగడాలు, వ్యవసాయంలో మెళకువలు తెలుసుకోవాలంటే పాలమూరు వ్యవసాయ క్షేత్రానికి వెళ్లాల్సి వస్తోంది. జిల్లాలో ఎక్కడ కూడా కృషి విజ్ఞాన కేంద్రంగాని, ఏరువాక కేంద్రాలు గాని లేవు. దీంతో రైతులు ఇబ్బంది పడాల్సి వస్తోంది.

–పెద్ద నర్సింహులు, యాపదిన్నె

కంది మాత్రమే పండిస్తున్నారు



50 ఎకరాల ప్రభుత్వ భూమిలో కంది పంట మాత్రమే పండిస్తున్నారు. అలంపూర్–రాయచూర్ ప్రధాన రహదారి పక్కన విశాలమైన ప్రభుత్వ స్థలంలో మార్కెట్ యార్డుగాని, గోదాంలు గాని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు గాని ఏర్పాటు చేయాలి.


– మహేశ్వర్‌రెడ్డి, కొంకల, వడ్డేపల్లి

పప్పు దినుసుల సాగు

పీడీ అండ్ డీ కేంద్రాల్లో పప్పు దినుసుల పంటలు సాగు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. వారి సూచనల మేరకు కంది పంట సాగుచేస్తూ వస్తున్నాం. గతంలో మినుములు, వేరుశనగ, వరి పండించే వాళ్లం. నష్టాలు రావడం, బోరు బావుల్లో నీరు ఇంకిపోవడంతో వర్షాధార పంట అయిన సీడు కంది సాగుచేస్తున్నాం.

–సక్రియానాయక్, డీఏఓ

ప్రాచీన కట్టడాలను పరిరక్షించాలి



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ: చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచిన పురాతన కట్టడాలు కూలిపోతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ప్రాచీన కట్టడాలను పరిరక్షించాలి బీజేపీ జిల్లా నాయకుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దేవబండ గ్రామంలో రాజుల కాలంలో నిర్మించిన రాతికట్టడం బురుజును పరిశీలించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలేదని, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. జిల్లాలో బీజేపీ దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, నరసింహులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులతో మోస్తరు వర్షం



గట్టులో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రాశులు

గట్టు: మండల కేంద్రంలో ఆదివారం ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం నల్లటి మబ్బులు కమ్ముకోవడంతో రైతులు ఆందోళన చెందారు. పీఏసీఎస్ ముందు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన వడ్లు తడవకుండా టర్పాలిన్ కవర్లు కప్పుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా చేయాలని పేర్కొన్నారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కల్లాల్లో ఉన్న పొగాకు, మిర్చి పంట తడిసి రైతులు తీవ్రఅవస్థలు పడ్డారు.

అఖండ ధ్యానంతో అద్భుతాలు సాధించొచ్చు



ధ్యాన మందిర వ్యవస్థాపకురాలు కమలమ్మను సన్మానిస్తున్న ధ్యానులు

వనపర్తిటౌన్: మానసిక, అశాంతి, అనారోగ్య సమస్యల పరిష్కారం కోసం ధ్యానమే దివ్య ఔషధమని శివకేశవ పిరమిడ్ ధ్యాన మందిర వ్యవస్థాపకురాలు గోర్ల కమలమ్మ అన్నారు. 2011 ఏప్రిల్ 15వ తేదీన జిల్లా కేంద్రంలోని పాతకోట శివాలయంలో శివకేశవ పిరమిడ్ ధ్యాన మందిరంతో ప్రతి ఆదివారం, అమవాస్య, పౌర్ణమి రోజు ధ్యానంపై అవగాహన కల్పిస్తూ అన్నదాన కార్యక్రమం నిర్వర్తించడంతో 14 ఏళ్లు పూర్తయిందని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాతకోట శివాలయంలో శివకేశవ ఆలయ కమిటీ సభ్యులు గోర్ల కమలమ్మను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతిరోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అఖండ ధ్యానం నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అఖండ ధ్యానానికి వచ్చే ప్రతి ఒక్కరికీ అల్పాహారం అందిస్తున్నట్లు వెల్లడించారు. ఏళ్ల తరబడి ధ్యాన శిక్షణకు, అన్నదానానికి గోపాల్ రెడ్డి, జైపాల్‌రెడ్డి, వసంత పూరి, చంద్రకళ, తిరుపతమ్మ, వెంకటేశ్వర్ తదితరులు సహకరించారని తెలిపారు. కార్యక్రమంలో వాసవి సేవా సమితి జాతీయ నాయకుడు పూరి సురేష్‌శెట్టి, శివకేశవ ఆలయ కమిటీ ప్రతినిధులు ఈశ్వరమ్మ, జ్యోతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి దశలోనే వ్యాధిని గుర్తించాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సీఐ టాటాబాబు

మానవపాడు: వ్యాధి లక్షణాలను మొదటి దశలోనే గుర్తించాలని స్థానిక సీఐ టాటాబాబు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను కామాక్షి ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉచిత ఆరోగ్య క్యాంపులు పేదవారికి ఉపయోగకరంగా ఉంటున్నాయన్నారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక వ్యాధులకు, ఈసీజీ, వివిధ రకాల జబ్బులకు సంబంధించిన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కామాక్షి ఆరోగ్య కేంద్ర మేనేజింగ్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ చైతన్యవాణి, డాక్టర్ సమత, డాక్టర్ శశిధర్‌రెడ్డి, డాక్టర్ సుభాన్, డాక్టర్ కేదాష్, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో ఎద్దు, 15 గొర్రెలు మృతి



బిజ్వారంలో పిడుగుపాటుతో మృతి చెందిన గొర్రెలు



కొండాపురంలో పిడుగుపాటుకు గురై మృతిచెందిన పశువులు

మల్దకల్: పిడుగుపాటుతో ఒక ఎద్దు, 15 గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని బిజ్వారం, మల్దకల్ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. మల్దకల్ గ్రామానికి చెందిన పుర్రతిమ్మప్ప పొలం పనులు ముగించి కాడెద్దులను అక్కడే ఉంచగా ఒక్కసారిగా పిడుగు పడడంతో ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. అలాగే బిజ్వారం గ్రామ సమీపంలో పిడుగుపాటుకు కుర్వ ఈరన్న చెందిన 15 గొర్రెలు మృతి చెందినట్లు బాధితుడు వాపోతున్నాడు. ప్రభుత్వం తరఫున ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కేటీదొడ్డి: మండల పరిధిలోని కొండాపురంలో రైతు హేమారెడ్డికి చెందిన రెండు పశువులు ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షంలో పిడుగుపడి ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు వాపోతున్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిన నాయకులు



అయిజ నుంచి తరలివెళ్తున్న నాయకులు



గంగన్‌పల్లి నుంచి తరలివెళ్తున్న నాయకులు

గట్టు/అయిజ/మానవపాడు/ధరూరు/కేటీదొడ్డి/: బీఆర్ఎస్ పార్టీ వరంగల్‌లో ఏర్పాటు చేసిన 25 ఏళ్ల రజతోత్సవ సభకు ఆదివారం పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. గట్టుకు చెందిన నేతలు ఆర్టీసీ బస్సులు, ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. కార్యక్రమంలో జయసింహారెడ్డి, రామునాయుడు, కొళాయి కృష్ణ, కంగారు తిమ్మప్ప, మల్లేష్, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

- బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అయిజ మండల కేంద్రంతోపాటు మండలోని ఆయా గ్రామాల బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లాయి. మండల కేంద్రంలోని తిక్కవీరేశ్వర స్వామి ఆలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు సమావేశమై సభకు తరలివెళ్లారు.
- మానవపాడు మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వరంగల్‌లో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ సభకు పెద్ద ఎత్తున్న తరలి వెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అశోక్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకట్రాములు, దామోదర్‌రెడ్డి, మురళీధర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, భాస్కర్ పాల్గొన్నారు.
- ధరూరు మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ నాయకుడు బాసు హనుమంతునాయుడు జెండా ఎగరవేసి రజతోత్సవ సభకు తరలివెళ్లారు. నాయకులు వెంకటేష్ నాయుడు, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.
- వరంగల్‌లో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కేటీదొడ్డి మండలంలోని ఆయా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు బస్సులు, ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మనోరమ, చక్రధర్‌రావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

శాంతినగర్/మానవపాడు/ఉండవెల్లి/ కేటీదొడ్డి/ ఎర్రవల్లి: ఆదివారం అమావాస్య సందర్భంగా వడ్డేపల్లి మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. శాంతినగర్ ఆయా గ్రామాల్లోని శివాలయాలు, ఆంజనేయస్వామికి ఆకు పూజ, పంచామృతాభిషేకాలు జరిపించారు. అర్చకులు అడివిస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

- మానవపాడు మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆంజనేయస్వామి దేవాయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు మదన్‌మోహన్, ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.
- ఉండవెల్లి మండలంలోని డి.బూడిదపాడు శివారులోని ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.
- కేటీదొడ్డి మండల పరిధిలోని పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారుర. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో చేపట్టారు.
- ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని అభయాంజనేయస్వామి ఆలయం అమావాస్య సందర్భంగా ఆకుపూజ, అభిషేకం వంటి క్రతువులు జరిపించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామన్‌గౌడ్, పాలక మండలి సభ్యులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.
- ధరూరు మండల పరిధిలోని ప్రధాన ఆలయాల్లో అమావాస్య ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం, పెద్దచింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయం, అల్వాలపాడు ఆంజనేయస్వామి, కోతులగిద్ద అరణ్యేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.



బూడిదపాడులో సీతారాముల పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



పెద్దచింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



భక్తులతో రద్దీగా బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయం

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పాన్‌గల్: శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారి దివ్య ఆశీస్సులతో 'త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక' జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని కొత్తపేటలో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. యోగీశ్వరులు రచించిన 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాల గురించి వివరించి, వారి జీవితంలో జ్ఞానమార్గం అనుసరించాలని కోరారు. పౌర్ణమి అనేది పూర్ణ దైవ జ్ఞానానికి గుర్తుగా ఉంటుంది కాబట్టి అజ్ఞానం నుంచి వెలుగు వైపు ప్రయాణించాలన్నారు. అమవాస్య, పౌర్ణమికి మధ్యలో అష్టమి తిథి రోజున శ్రీకృష్ణుడు జన్మించి జ్ఞానం, అజ్ఞానానికి మధ్యలో వారధిలా కనిపిస్తున్నాడు. శ్రీకృష్ణుడిని, భగవద్గీతను విశ్వశించకపోతే అమవాస్య వైపు నడిచి అజ్ఞానంలో మునిగి మోక్షం పొందలేరన్నారు. వెంకట్రాములు, సురేష్‌కుమార్, బద్రీనాథ్, కృష్ణయ్య, లలితమ్మ, శివమ్మ, అలివేలమ్మ పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలు జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

వనపర్తి రూరల్: 139వ మే డే ఉత్సవాలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయం ఎదుట వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు భారీ సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంతో మంది ప్రాణ త్యాగాలతో కార్మిక హక్కులు సాధించుకున్న సందర్భంగా మే డే ఉత్సవాలను నిర్వహించుకుంటారన్నారు. కార్మికుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న హక్కులను ఈ ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే కార్మికులు అందరూ ఏకమై కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గోపాలకృష్ణ, రమేష్, ఎర్ర కురుమయ్య, చిన్న కురుమయ్య, గంధం శ్రీనివాసులు, వరుణ్ పాల్గొన్నారు.

సేవాభావమే ముఖ్యం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: లింగాయత్‌లు సేవాభావంతో జీవిస్తారని, అందరికీ సహాయం చేయడానికి సిద్ధంగా ఉంటారని వీరశైవ సమాజం జిల్లా అధ్యక్షుడు ముక్త శ్రీశైలం అన్నారు. ఆదివారం స్థానిక టీచర్స్‌కాలనీలోని రామాలయంలో సంఘం జిల్లా, మండల కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సేవే పరమావధి అని పేర్కొన్నారు. కాగా, వీరశైవ సమాజం జిల్లా గౌరవాధ్యక్షుడిగా జంగం శివరాజ్, అధ్యక్షుడిగా ముక్తా శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా గాజుల మృత్యుంజయ, కోశాధికారిగా చీరాల రాజశేఖర్, ప్రచార కార్యదర్శిగా ఏల్పాటి రాజ్‌కుమార్, గౌరవ సలహాదారుగా కాన్‌కుర్తి సిద్ధిరామప్పను ఎన్నుకున్నట్లు తెలిపారు.